క్లుప్తంగా

నాణ్యత లేని విత్తనకాయలు వెనక్కి పంపండి



కమ్మూరులో విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ విజయకుమార్

కూడేరు: రైతు సేవా కేంద్రాలకు సరఫరా అవుతున్న సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతగా లేకపోతే వెనక్కి పంపాలని ఏఓ విజయకుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కాయలు రైతు సేవా కేంద్రాలకు చేరాయి. విత్తనకాయల నాణ్యతను ఏఓ పరిశీలించారు. 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం క్వింటా రూ.5,580తో అందిస్తోందన్నారు. ప్రస్తుతం మండలానికి 800 క్వింటాళ్లు సరఫరా అయ్యాయని, వారం రోజుల్లో పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లమొక్కల సాగు లాభదాయకం



మాట్లాడుతున్న హ్యాండ్ సంస్థ ప్రతినిధి నారాయణ స్వామి

కూడేరు: పండ్ల మొక్కల సాగు లాభసాటిగా ఉంటుందని హ్యాండ్ సంస్థ ప్రతినిధి నారాయణస్వామి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పి.నారాయణపురంలో హ్యాండ్ సంస్థ ఆధ్వర్యంలో ఆగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధి నారాయణ స్వామి మాట్లాడారు. ఉచితంగా మామిడి, నేరేడు, ఎర్రచందనం, టెంకాయ, నిమ్మ, మహాగని మొక్కలను అందజేస్తామన్నారు. బోరు, డ్రిప్ సౌకర్యం ఉన్న రైతులకు ఉచితంగా ఇచ్చే పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కాంతమ్మ, వీహెచ్ఏ ప్రమోద్, సంస్థ కో ఆర్డినేటర్లు నాగలక్ష్మీ, హరి, రైతులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి బలవన్మరణం



దురగన్న (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లిలో దురుగన్న (41) కడుపునొప్పి తాళలేక చింతచెట్టుకు ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్యచేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. దురుగన్న గ్రామ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్(హరిత రాయబారులు)గా పని చేసేవాడు. నాలుగేళ్ల నుంచి అతను కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితంలేకపోయింది. మనస్తాపంతో గ్రామ సమీపంలో చింతచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లే స్థానికులు సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మారెక్క, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియాతో బోదకాలు వ్యాధి

కూడేరు: ఫైలేరియాతో బోదకాలు వ్యాధి వస్తుందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని అరవకూరు గ్రామంలో బోదకాల వ్యాధి నిర్ధారణ కోసం ఇంటింటా రక్త నమూనాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం మలేరియా సబ్‌యూనిట్ అధికారి మద్దయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు నూరుబాషా, శ్రీధర్ మూర్తి, రవీంద్ర, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని నిరాహార దీక్ష



శెట్టూరులో రిలే నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

శెట్టూరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్దరించాలని శెట్టూరు మహిళా సంఘం సభ్యులు, దళిత సంఘాల నాయకులు కలిసి సోమవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆర్డీటీ సంస్థ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా అనుమతి ఇవ్వాలని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, లీడర్లు, దళిత నాయకులు చెవుల కిష్టప్ప, టైలర్ వన్నూరుస్వామి, లింగప్ప, సీబీటీలు పాల్గొన్నారు.



గుంతలమయంగా ఉన్న రహదారి



గొంచిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు గుంతలు స్థానికులే పూడుస్తున్న దృశ్యం



ములకనూరు నుంచి రాళ్ల అనంతపురం వెళ్లే రోడ్డు ఇలా..

ప్రగతి బాటలు..బీటలు

- పల్లె రోడ్లపై తప్పని పాట్లు
- గుంతలు పడి అధ్వానంగా ఉన్న పల్లె దారులు
- నరకయాతన పడుతున్న ప్రజలు
- అటవీప్రాంతాల్లో పలు రోడ్లు మరీ అధ్వానం
- పట్టించుకోని కూటమి సర్కారు

కళ్యాణదుర్గం: ఇటీవల బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చెందిన ఓ వ్యక్తి తన వ్యక్తిగత పనుల నిమిత్తం కళ్యాణదుర్గానికి ద్విచక్రవాహనంపై వచ్చి సాయంత్రం తిరుగుపయనమయ్యాడు. కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతోపాటు అడవి పందులు అడ్డు వచ్చాయి. దీంతో అతను అదుపుతప్పి కిందపడ్డాడు. ఇలా రోజూ పల్లె రోడ్లపై పాట్లు పడాల్సి వస్తోంది. ఇలా నియోజకవర్గంలో అనేక గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలకు గురవుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రం నుంచి బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి, గొంచిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే దారి లేక ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఉన్న ఒకే ఒక్క రహదారి కావడంతో 15 నిమిషాల ప్రయాణం గంటకు పైగా పడుతోంది. ముప్పలకుంట నుంచి గొంచిరెడ్డిపల్లికి 6 కిలో మీటర్ల మేర రోడ్డు సరిగాలేదు. ఈ రోడ్ల గుండా వెళ్లాలంటే గర్భిణులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రోడ్లు ఇలా..

కళ్యాణదుర్గం నుంచి ముద్దినాయనపల్లి, హనిమరెడ్డిపల్లి నుంచి ముద్దినాయనపల్లి, గోళ్లనుంచి మానిరేవు వరకు నుసికొట్టాల నుంచి ఆత్మకూరు వరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కంబదూరు మండలం ములకనూరు నుంచి రాళ్ల అనంతపురం కంబదూరు నుంచి పాల్లూరు, కదిరి దేవరపల్లి నుంచి తిమ్మాపురం వరకు అధ్వానంగా ఉన్నాయి. శెట్టూరు మండలం నుంచి లక్ష్మంపల్లి, చింతర్లపల్లి నుంచి కనుకూరు , చింతర్లపల్లి నుంచి మొలకలేడు వరక అధ్వానంగా ఉన్నాయి. బ్రహ్మసముద్రం నుంచి ఎరడికెర, బ్రహ్మసముద్రం నుంచి శెట్టూరు వరకు, కుందుర్పి మండలం ఏళ్ల చింత నుంచి అల్లాపురం, జంబుగుంపల నుంచి బెస్తరపల్లి, నాగేపల్లి నుంచి శ్రీమజ్జనపల్లి, నిజవల్లి నుంచి వెంకటంపల్లి వరకు గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

మరమ్మతులు ఆర్భాటమే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల ప్యాచ్ వర్కులు (మరమ్మతులు) అంటూ పాలకులు ఆర్భాటం చేశారు. ప్రధాన రహదారుల తప్పా నియోజకవర్గ కేంద్రం నుంచి బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి, ముప్పలకుంట నుంచి గొంచిరెడ్డిపల్లికి వెళ్లే రహదారులకు మరమ్మతులు చేయకుండా మర్చిపోయారు. రూ.లక్షలు వెచ్చించి, గ్రామీణ రోడ్లను బాగు చేస్తున్నట్లు గొప్పలు చెప్పి.. అక్కడక్కడ ప్యాచ్ వర్కులు చేసి చేతులుదులుపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలా సార్లు ఆర్అండ్‌బీ అధికారులకు, కూటమి నేతలకు రోడ్డు బాగు చేయాలని చెప్పినా పట్టించుకోలేదు. రోజూ ఎవరో ఒకరు కింద పడి ఆస్పత్రి పాలవుతున్నారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలి.

– ఓబిలేశు, ముప్పలకుంట

రోడ్డు వేయండి



మా గ్రామాలకు మేము ఏదీ అడగడం లేదు. ముందు రోడ్డు బాగు చేయండి. పాలకులు పట్టించుకోలేదని ఆటో డ్రైవర్లు, స్థానిక యువకులు కలిసి మేమే స్వచ్ఛందంగా గుంతలు పూడ్చి మట్టి వేసుకుంటున్నాము. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకోవాలి.

– తలారి సురేష్, ముప్పలకుంట

ప్రాణాలు పోతున్నా పట్టదా?



కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లికి వెళ్లే రహదారి బాగు లేక చాలా మంది రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టాం..అనేక రకాలుగా నిరసనలు తెలియజేసాం. ప్రభుత్వానికి కనికరం లేదు. ఎంతమంది ప్రాణాలు పోయాక రోడ్డు బాగు చేస్తారో అర్థం కావడం లేదు. వెంటనే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు చొరవ చూపాలి.

– ఓంకార్, సీపీఐ పట్టణ కార్యదర్శి, కళ్యాణదుర్గం

ఆక్రమణ స్థలాలు వారం రోజుల్లో ఖాళీ చేయాలి

కుందుర్పి: ఆక్రమణ స్థలాలను వారం రోజుల్లో ఖాళీ చేయాలని పురావస్తుశాఖ, రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కుందుర్పి వీరభద్రస్వామి ఆలయ భూమిని ఇటీవల కొందరు అన్యాక్రాంతం చేసుకోగా, పురావస్తుశాఖ అధికారులు స్పందించారు. సోమవారం పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిత ఆదేశాల మేరకు తహశీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ నగేష్ ఆధ్వర్యంలో ముగ్గురు సర్వేయర్లు, ఇద్దరు వీఆర్‌ఓల సమక్షంలో అన్యాక్రాంతమైన భూమిని సర్వేచేసి హద్దులు చూపించారు. సర్వే మేరకు ఆక్రమణ స్థలాలను వారం రోజుల్లో ఖాళీ చేయాలని రెవెన్యూ, పురావస్తు శాఖ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఆలయ కమిటీ సభ్యులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వీరభద్రస్వామి ఆలయ భూమి హద్దులు చూపుతున్న అధికారులు

హంద్రీ-నీవా లైనింగ్ పనులు ఆపాలి

ఆత్మకూరు: హంద్రీ-నీవా అనంత జిల్లా ప్రజల మానసపుత్రిక. హంద్రీ-నీవా కాలువ నీటితో లక్షల ఎకరాలు తడుస్తూ వేల మంది రైతుల కడుపునింతున్నాయి. అలాంటి హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రి డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడారు. లైనింగ్ పనులు పూర్తిగా ఆపి కాలువ వెడెల్పు చేయాలన్నారు. పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ఆయకట్టు వరకు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా కాలువ పక్కన పొలాలు ఉన్న రైతుల బోర్లు ఎండిపోకుండా భూగర్భ జలాలు పెరగాలంటే కాలువ లైనింగ్ పనులు తక్షణమే ఆపాలన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు పంటలు పండక అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో లైనింగ్ పనులు చేసి భూగర్భ జలాలు పెరగకుండా చెరువులకు నీరు అందకుండా ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, రాము, రాజేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి రాము నాయక్ అన్నారు. సోమవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులను ఆయుష్ ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ.. ఉద్యోగులకు న్యాయపరంగా అందాల్సిన వాటి కోసం పోరాడతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూరల్ కమిటీ అధ్యక్షుడు మారుతిప్రసాద్, ఆయుష్ ఉద్యోగులు సత్యప్రసాద్ రావు, సుదర్శన్ రెడ్డి, సుధాకర్, సునీల్, నాగరాజు, ఈశ్వరయ్య, తిమ్మరాజు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యుటేషన్ వ్యవధి కుదింపు తగదు



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కళ్యాణదుర్గం రూరల్: కమ్యుటేషన్ వ్యవధి కుదింపు తగదని విశ్రాంత ఉద్యోగులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ వసంత్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ అనేక రాష్ట్రాల్లో కమ్యుటేషన్ వ్యవధి 12 ఏళ్లకు కుదించి, రికవరీ నిలిపివేశారన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో రికవరీ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో విశాంత్రి ఉద్యోగులు మల్లికార్జున, కృష్ణయ్య, కృష్ణమూర్తి, అంజనప్ప, వన్నూరస్వామి, మచ్చన్న, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవింగ్స్ ఖాతాలకు శిబిరాలు

అనంతపురం సిటీ: పోస్టాఫీసుల్లో సేవింగ్స్ ఖాతాలు తెరిచేందుకు ఈనెల 31 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్ట్ ఆఫీసుల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్ ప్రక్రియ చేయనున్నట్లు వివరించారు. జూన్ 4వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం 13,480 లబ్ధిదారులకు ఎన్‌పీసీఐ లింక్ కాని ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాల ఫలాలు లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతాయని పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో సైతం పోస్టాఫీసులో ఆధార్ సీడింగ్‌తో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవింగ్ ఖాతాలు తెరుస్తున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి పంచాయతీలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కు సర్పంచు అతావుల్లా ఆధ్వర్యంలో రైతులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు విన్నవించారు. మందలపల్లి, అప్పిలేపల్లి, జానకంపల్లి గ్రామాల్లో కుందుర్పి ఫీడర్ నుంచి విద్యుత్ సక్రమంగా సరఫరా కాలేదన్నారు. ఆదివారం ఒక్క రోజే రక్షిత మంచినీటి పథకం మోటార్‌తో పాటు 12 మోటర్లు లోవోల్టేజీతో కాలిపోయినట్లు వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: 2016 దివ్యాంగుల హక్కుల చట్టం తెలుగు అనువాద పుస్తకాన్ని సోమవారం గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ నగరంలో ఆవిష్కరించారు. చాలా చోట్ల దివ్యాంగులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టంలోని అట్రాసిటీలోని 92 సెక్షన్‌కు సంబంధించి వెంటనే ఎఫ్ఐఆర్ కట్టి బాధితులకు న్యాయం చేయాలని పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి కోరారు. కచ్చితంగా దివ్యాంగులందరికీ న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, న్యాయ సలహాదారుడు జెన్నే ఆనంద్, సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్షన్న, దివ్యాంగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు డుమ్మా

కణేకల్లు: మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగాల్సి ఉంది. రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడంతో డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉంది. ఉదయం 10.30 గంటలకు ఆయన క్షేత్రస్థాయి తనిఖీకి వెళ్లారు. అధికారులు కూడా అందుబాటులో లేకపోవడంతో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన జనం నిరాశతో వెనుదిరిగారు. ఇంతకీ కణేకల్లులో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం ఉందా? లేకుంటే పూర్తిగా ఎత్తేశారా? అని ప్రజలు పెదవి విరిచారు.

ఆర్డీటీ పరిరక్షణకు కలసికట్టుగా ఉద్యమిద్దాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య

శెట్టూరు: ఆర్డీటీ పరిరక్షణకు కలసికట్టుగా ఉద్యమించి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుదామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. సోమ వారం మండలంలోని యాటకల్లులో పాదయాత్రకు సంబంధించిన రోడ్డు మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ జూన్ 4న బెళుగుప్ప మండలం నుంచి పాదయాత్ర తలపెట్టినట్లు తెలిపారు. యాటకల్లు , బచ్చహల్లి, తైరేవు, చెర్లోపల్లి, యర్రబోరేపల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఆర్డీటీని కాపాడుకునేందుకు అందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు పార్టీలు, కుల,మతాలకతీతంగా పాదయాత్రకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమనాథ్‌రెడ్డి, కన్వీనర్ రాయుడు, మాజీ ఎంపీపీ రామ్‌భీమప్ప, సర్పంచులు ఈరన్న, ప్రకాష్, చిట్టెమ్మ, వైస్ ఎంపీపీ ముత్యాలు,పార్టీ అనుభం సంఘాల నాయకులు తిప్పేస్వామి, ఎంపీటీసీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



యాటకల్లులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

సేవ్ ఆర్డీటీ పాదయాత్రను జయప్రదం చేయండి

బ్రహ్మసముద్రం : బెళుగుప్ప మండలం నుంచి సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో భాగంగా చేస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కుర్లగుండ, తీటకల్లు, బొమ్మగానీపల్లి, పిల్లలపల్లి, కోనాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. పాదయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరువు నేలపై కాలు మోపి పేద ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందించిన ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, జిల్లా కమిటీ అనుబంధ సంఘాల నాయకులు గోపాల్‌రెడ్డి, మంజు, ఎర్రంపల్లి క్రిష్ణమూర్తి, తాలూక కార్మిక సంఘం అధ్యక్షుడు సంజీవ, మండల కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెస్ రాయుడు, గోళ్ల సూరి, గొల్ల హనుమంతరాయుడు, ఎంపీపీలు కంభం చంద్రశేఖర్‌రెడ్డి, అంజీ ,రైతు సంఘం అధ్యక్షుడు అభిలాష్, ఎంపీటీసీలు బుసప్ప, తిప్పేస్వామి, సర్పంచులు శంకరప్ప, రామ్మోహన్, తలారి గోవిందప్ప, నాయకులు మహదేవప్ప, పాత లింగ, మల్లి, తిమ్మారెడ్డి, కొండపురం రాము, అంజి, మంజు, హనుమంతు, రామకృష్ణ, కిరణ్, శంకర్‌నాయక్,రాము, ప్రశాంత్, మంజు, గోవిందు, జానీ శరణప్ప పాల్గొన్నారు.



కుర్లగుండలో నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

పాదయాత్రను విజయవంతం చేద్దాం

కుందుర్పి: సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేద్దామని మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన మండల నాయకులతో కలిసి బోదపల్లి, ఎనుములదొడ్డి, ఎస్.మల్లాపురం తదితర గ్రామాల్లో పర్యటించి, రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఎంపీపీ నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, మందలపల్లి భీమప్ప, సర్పంచులు వన్నూర్‌రెడ్డి, విజయ్, అతావుల్లా, నాయకులు బోదపల్లి భాస్కర్, హరీష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, బొమ్మలింగ, సురేష్, తూముకుంట గంగాధర పాల్గొన్నారు.

సాధించాలన్న సంకల్పం ఉండాలి

- ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి



క్యాడెట్లకు ఫైరింగ్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

కూడేరు: సాధించాలన్న 'సంకల్పం' ఉంటే ఏ రంగంలోనైనా ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ-1 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. 500 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. సోమవారం క్యాడెట్లకు ఆయుధాలు, ఫైరింగ్ పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి మాట్లాడారు. దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యంపై ఏవిధంగా దండెత్తుతారో వివరించారు. ప్రతిభకనబరిచి టార్గెట్ చేరుకున్న క్యాడెట్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జేసీఓలు కైలాస్ బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్, ఎం.ఎండీ ముదస్సర్, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27,28 తేదీల్లో బొమ్మనహాళ్ హైస్కూల్‌లో 29న శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగాసానాల శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, డాక్టర్ కుమారరాజా, ఎంఈఓ మల్లికార్జున, పీఆర్ జేఈ జగదీష్ పాల్గొన్నారు.

కణేకల్లు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా శ్రీనివాసప్రసాద్

కణేకల్లు: కణేకల్లు జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎంగా శ్రీనివాస ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరులోని జెడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేస్తున్న శ్రీనివాస ప్రసాద్‌ను డీఈఓ కణేకల్లుకు బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో లగేజీ వాహనం

బొమ్మనహాళ్: మండలంలోని ఎల్‌బీ నగర్‌లో బొలెరో, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు.. ఎల్‌బీ నగర్‌కు చెందిన శ్రీనివాసులు నిత్యావసరాలు తెచ్చుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, కళ్యాణదుర్గం నుంచి బళ్లారి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుతీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని బళ్లారి విమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బాల నటుడికి సత్కారం

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన బాల నటుడు పోగునూలు చక్రవర్తికి మెమొంటోలు అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. పలు పౌరాణిక నాటకాల్లో అద్భుతంగా నటించి, ప్రేక్షకుల మన్ననలు పొందాడు. జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిరంలో ఎన్టీఆర్ జయంతి వార్షికోత్సవాల్లో భాగంగా చక్రవర్తిని ఘనంగా సత్కరించారు.

రిపోర్టర్ కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: మండలంలోని బూదగవి గ్రామానికి చెందిన హెచ్ఎం టీవీ రిపోర్టర్ బోయ నాగరాజు ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, పార్టీ నాయకులు వడ్డే ఆంజనేయులు, ధనంజయ తదితరులు నాగరాజు స్వగ్రామం వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు తదితరులు కూడా నివాళులు అర్పించారు. నాగరాజు భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు.